ఎవరూ లేని చోటు

◆ సతీష్ చందర్

"ఒరేయ్ నేనింక తట్టుకోలేను. వదిలెయ్యాలి"

ప్రాధేయపడుతూ నా కాలర్ పట్టుకున్నాడు పక్షిగాడు. బిక్కమొహంతో దిక్కులు వెతికాను. ఏసీ రెస్టారెంట్ మసక చీకట్లో మమ్మల్నెవరూ గుర్తుపట్టివుండకపోవచ్చు. చేతులు బదులు కాళ్ళుపట్టుకోవడానికి ఇలాంటివే అనువైన స్థలాలు.

"వదిలేస్తానంటున్నావ్. అర్థనూటపదహార్లూ పూర్తయిపోయాయా?"

గుండెలు ఖాళీ సాసర్లో పెట్టుకొని అడిగాను.

"మూడు రోజుల కిందటే లేపేశాను"

వాడి జవాబుకి కాఫీ పోట్లో బదులు చొక్కా మీద పడింది. నేను బాధపడ్లేదు. మసక చీకటికదా.

"అవున్లే వ్యాసాలు రాసేవాడికి కవిత్వమొక లెఖ్ఖా?"

వాడి ప్రశంస అనుకొని పక్షిగాడు గర్వంగా సిగ్గుపడబోయాడు. జీవితంలో నటిస్తే చీకట్లో కూడా రక్తికడుతుంది.

పక్షిగాడు తాను కవిత్వం రాయనున్నట్లు నెల క్రితం చెప్పాడు. ఏభయి యెనిమిది కవితలు రాసి 'అర్థనూట పదహార్లు' అనే శీర్షికతో అచ్చువెయ్యాలని వాడి సంకల్పం. అనుకున్న పనిని మూడు రోజులు ముందుగానే పూర్తిచేశాడు. అచ్చువేసే ముందు నిర్జన ప్రదేశంలో నాకు వినిపించాలని వాడి కోరిక. అదేమంటే - గజానికొక కాపీ కవి వున్నాడని వాడికనుమానం.

వాడికిప్పుడు ఏదో ఒక ముహూర్తం చెప్పాల్సిందే. కాఫీ - అంటేచాలు కాకా హోటల్‌కి నడిపించే పక్షిగాడు ఏసీ రెస్టారెంట్‌కు తెచ్చినందుకైనా వాడికి అప్పాయిట్‌మెంట్ ఇవ్వాలి. లేకపోతే రేపట్నుంచి వాడు చూసే చూపులకి నేను కృతజ్ఞతా భారంతో కృంగి కృశించాల్సి వుంటుంది.

"రేయ్ పక్షీ. రేపు సాయంత్రం సరిగ్గా అయిదున్నర గంటలకు ఊరు చివర పిండాల సత్రంలో నీ కవితాపఠనం"

పక్షిగాడు ఆనందంతో రెక్కలు టపటప లాడించాడు. ఉత్తర క్షణంలోనే వాడికనుమానం వచ్చింది.

"శ్రోతవు నువ్వొక్కడివే కదూ?" అన్నాడు.

నాకు చిర్రెత్తుకొచ్చి,

"కాదు. అది పిండాల సత్రం కదా. పితృదేవతలు కూడా వస్తారు. అప్పుడు నువ్వు శ్రీనాథుడి లెవెల్లో ఫోజుపెట్టి - దివిజ కవివరుల గుండియల్ దిగ్గుమనగ చదువుచున్నాడు పక్షిగాడమర. కవిత - అని కూడా హెచ్చరించవచ్చు"అని అన్నాను.

"ఏరా, మరీ శ్రీనాథుడిలా కూడా రాయలేనంటావా?"

పక్షిగాడు గంభీర స్వరంతో తన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు.

వాణ్ణింకేమాత్రం కదిపినా నన్నయ వరకూ వెళ్ళిపోతాడని భయపడ్డాను.

"సరే, రేపు నువ్వు సూట్‌కేసులో ఏభయెనిమిది కవితలూ పెట్టుకొని పిండాల సత్రానికొస్తున్నావ్. ఒకే"

"అక్కడెవ్వరూ వుండరు కదా?"

"పిశాచాలుంటాయంటారు కాని నాకు నమ్మకం లేదు."

"అయితే ఓకే"

ఇద్దరం లేవబోయాం. లైట్లు వెలిగాయి. ఇదేమిటని బేరర్ని అడిగాను.

కరెంటు పోయిందన్నాడు.

"ఇదేమిటి? కరెంటుపోతే లైట్లు వెలగడమేమిటి?"

నేను నోటి మీద వేసుకుంటున్న వేలును పట్టుకొని బయటకులాక్కెళ్ళాడు.

"రేయ్ పిచ్చి సన్నాసీ, ఇప్పుడు నువ్వు అన్నావ్ చూడూ - అది నా యాభయితొమ్మిదవ కవిత. ఎలాగంటే -

నా దేశంలో

సూర్యోదయమయ్యాకనే చీకటి పడుతుంది

కరెంటు పోయాకనే వెలుతురు వస్తుంది"

"రేయ్ పక్షీ ఇది అన్యాయం. యాభయెనిమిదే కదా నువ్వు వినిపిస్తానన్నది. అది కూడా రేపు కదా. మరి ఇదేవిట్రా?"

దాదాపు కాళ్ళమీద పడబోయాను. ఈలోగా మాకు సర్వ్ చేసిన బేరర్ బయట కొచ్చాడు.

"ఇందాక కరెంటు పోతే జనరేటర్ వేశాం. జనరేటర్ మీద ఏసీ ఆన్ చేయనివ్వడు మా ఓనరు. అందుకే కిటికీలు తీసి లైట్లు వేశాం. సారీ ఫర్ ది ఇన్ కన్వీనియన్స్"

పాపం! చిన్న టిప్పుకు ఎక్కువ కృతజ్ఞత చూపాడు.

రేపటి లోపు కవిత్వం వినిపించకూడదన్న షరతు మీద పక్షిగాడితో గోదావరి ఒడ్డుకి వెళ్ళాను.

* * *

గోదావరిని చూసిన వెంటనే పక్షిగాడు రెచ్చిపోయేవాడే. కాని షరతు గుర్తుకొచ్చి కవితావేశాన్నంతా అదిమిపెట్టుకొని పుష్కరాల రేవు మెట్ల మీద కూర్చున్నాడు. నేను వాడి ప్రక్కనే బెరుగ్గా కూర్చున్నాను.

ఇద్దరం ఎంతో విశ్శబ్దంగా, క్రమశిక్షణగా అక్కడ కూర్చోవడం కొందరికి భయం కలిగించింది కూడా. ఇద్దరు ముగ్గురు ప్రేమ జంటలు ముందు మాకు దగ్గరగా కూర్చోబోయి మమ్మల్ని చూసి లేచిపోయారు. మరీ నోరు విప్పకుండా కూర్చున్నామేమో - పెద్దమనుషులమనుకొని అపోహపడి వుంటారు.

ఒక ప్రేమ జంట మాత్రం మాకు అతి చేరువలో కూర్చున్నారు. ప్రియుడు వారిస్తున్నా ప్రేయసి చొరవ చూపడం వల్ల వాళ్ళక్కడ కూర్చోగలిగారు. ప్రియుడక్కడ కూర్చున్నాడన్న మాటేగాని వచ్చింది మొదలు దిక్కులు చూస్తూనే వున్నాడు. ముఖానికడ్డుగా చేతులు పెట్టుకుంటూనే వున్నాడు.

"పక్షీ! వాళ్ళిద్దర్నీ చూడు. ఎలా అనిపిస్తున్నారు? అతడేమో ఖడ్గతిక్కన లాగానూ, ఆమె మార్టినా నవ్రతిలోవా లాగానూ లేరూ?"

పక్షిగాణ్ణి కదిపాను.

"నీతో అదేరా చికాకు. నువ్వెప్పుడూ నాన్ సీరియస్‌గా వుంటావు? నన్నడిగితే ఇలాంటి కాంట్రాస్ట్ కపుల్స్ దగ్గరే కవితా వస్తువు దొరుకుతుందంటాను."

"నాయనా పక్షీంద్రా! మళ్ళీ కవిత్వం చెబుతావా?"

"చెప్పను. స్వీకరిస్తాను."

ఇద్దరం మళ్ళీ మౌనందాల్చి వాళ్ళను పరిశీలించడం మొదలుపెట్టాం.

"డార్లింగ్, రేపటి తేదీ ఏమిటో నీకు గుర్తుందా?"

కుంచించుకుపోతున్న ప్రియుడి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని అడిగిందామె.

"దానిదేముంది? ఇవాల్టి తేదీకి ఒకటి కలిపితే సరి."

తల పైకెత్తకుండా సమాధానమిచ్చాడు ప్రియుడు.

అతడెత్తిన ఒకటి మొట్టి ఆమె చివాల్న లేచిపోబోయింది.

"దీన్నిబట్టి నా మీద నీ కెంత ప్రేముందో అర్థమౌతోంది" అంటూ అభాండం కూడా వేసింది.

"ఇదెక్కడి గొడవ డియర్. రేపటి తేదీకి, మన ప్రేమకీ లింకేమిటి చెప్ప"

"ఛీ..ఛీ.. నీలాంటి మతిమరుపువాణ్ణి ప్రేమించడం నాదే పొరపాటు. రేపు నా బర్త్‌డే కదూ?"

మా వైపు ఒకసారి చూసి, వాళ్ళని మేం గమనించడం లేదని గమనించి అమాంతం ప్రేయసి కాళ్ళు పట్టేశాడు ప్రియుడు.

"డియర్. చెప్ప నీ కోరిక. నీ బర్త్‌డేకి ఏం తేవాలి? నేనేం చెయ్యాలి?" చేతుల్ని నిమిరినంత సుకుమారంగా ప్రేయసి పాదాలను నిమిరాడు.

"ఏమీలేదు డియర్. ఈ పుట్టిన రోజన నాక్కాబోయే భర్తతోనే నా కురులకు జడ వేయించుకుంటానని శపథం చేశాను."

ద్రౌపది స్థాయిలో చెప్పింది ప్రేయసి.

"అనవసరంగా ఎందుకంత తీవ్రమైన శపథం చేశావ్?"

"అనవసరమేమిటి? అవసరమయ్యే చేశాను. లేకపోతే ఆ బక్క విలన్‌గాడు నన్నంత మాట అంటాడా? "

"ఎవ్వడు వాడు?"

"వాడే, అంట్ల వెధవ. మా మేనమామ కొడుకు. నీ కెప్పటికైనా నేనే మొగుణ్ణి అన్నాడు. దాంతో ఈ శపథం చేశాను."

ప్రియుడికి కొద్దిసేపు మాట పెగల్లేదు. తర్వాత తేరుకున్నాడు

"అయితే మనం రేపు వేరే ఊరు వెళ్ళిపోదామా?"

"అది పిరికితనం అవుతుంది. రేపు ఇక్కడే, ఈ ఊళ్ళోనే, దానవాయిపేట పార్కులో సాయంత్రం సరిగ్గా అయిదున్నర గంటలకు నువ్వు దువ్వెనా, జడగంటల్తో వస్తావు. కురులు విప్పకొని నేను వస్తాను. ఆ అంట్ల వెధవ చూస్తూవుండగా నువ్వు నాకు జడ వేస్తావు."

"మరీ అంత పబ్లిగ్గానా?"

"ఆ టైమ్‌కు నువ్వూ, నేనూ, ఆ అంట్ల వెధవా తప్ప మరెవ్వరూ వుండరు. వాది హామీ"

ప్రియుడు బిక్కమొఖంతోనే ఒప్పకున్నాడు. ఇద్దరూ లేచి వెళ్ళిపోయారు.

"రేపు సాయంత్రం అయిదున్నర మంచి ముహూర్తంలాగే వున్నట్టుందే" పక్షిగాడు ఈ లోకంలోకి వచ్చాడు.

* * *

కవితా సంకలనం వెయ్యాలన్న ముందు చూపుతో చాలా రోజుల్నుంచి పక్షిగాడు స్కూటర్ బయటకు తియ్యడం లేదు. ఆ సంకలనానికి నేను కూడా ఒక చెయ్యి వెయ్యాల్సి వుంటుందని నా స్కూటర్‌ని కూడా వాడు బయటకు తియ్యనివ్వడం లేదు. అందుకే ఆ రోజు రెస్టారెంట్‌కీ, గోదావరి ఒడ్డుకీ పాదచారులంలా తిరిగాం. ఇక తిరిగే ఓపిక లేక సిటీబస్సు ఎక్కవచ్చుకదా - అని డీలక్స్ సెంటర్‌కి చేరుకున్నాం.

బస్‌స్టాప్ కిటకిటలాడుతోంది. పక్షిగాడు దీనంగా ముఖం పెట్టి శూన్యంలోకి చూస్తున్నాడు. కవిత్వం రాయడం మొదలు పెట్టినప్పటి నుంచి వాడి వాలకం అలా తయారయ్యింది. ఈలోగా కెనెటిక్ హోండా ఒకటి రయ్‌మని దూసుకొంటూ వచ్చి దాదాపు పక్షిగాణ్ణి గుద్దినంత పనిచేసింది. పక్షిగాడికి చిర్రెత్తుకొచ్చింది. పంచాంగం విప్పబోయేడు. కాని డ్రైవింగ్ సీట్లో వున్నది మహిళ అని తెలుసుకుని ఊరుకున్నాడు.

"నిలబడేటప్పుడు కాస్తంత చూస్తూనిలబడాలి" వెనక సీట్లో కూర్చున్న పురుషపుంగవుడు పక్షిగాణ్ణి మందలిస్తూ దిగాడు.

"ఎవర్ని స్వామీ?" పక్షిగాడి వెటకారం మొదలయ్యింది.

ఈలోగా ఆ మహిళ జోక్యం చేసుకొని, "ఊర్కోండి మన దే తప్పు. మీతో మాట్లాడుతూ స్కూటర్ నడపడం వల్ల ఇదంతా జరిగింది" అని తన భర్తకి నచ్చచెప్పి పక్షిగాడికి సారీ చెప్పింది.

"అవున్లే. అసలు నీ వెనకాల కూర్చోవడమే శుద్ధ తప్పు. ఎలాగూ ఇక్కణ్ణుంచి బస్సు మీదే వెళ్ళాలి కదా. సగం దూరం భాగ్యానికి స్కూటర్ మీద రావాలా ఏమి?" భర్త చిన్నబుచ్చుకున్నాడు.

"సగంలో ఎవరు దిగమన్నారు? వేరుగా ఇంటివరకూ స్కూటర్ మీదే వెళ్ళిపోదామంటే మీకు అవమానం. భార్య ఉద్యోగం చేసి సంసారం నడుపుతుంటే అవమానం కాదు కాని స్కూటర్ నడిపితే వచ్చేస్తుంది అవమానం!"

"చాలు చాల్లే. ఆఫీసు నుంచి ఈ బస్‌స్టాండ్‌కి వచ్చేలోగానే చాలా మంది కళ్ళల్లో పడ్డాం. ఇంటివరకూ కూడానా? చూడూ, చివరిసారిగా చెపుతున్నాను. నువ్వసలు నాకు స్కూటర్ నడపడం నేర్పేది వుందా లేదా? తేల్చి చెప్ప"

ఇద్దరూ కాస్సేపు బస్‌స్టాండునే తమ సొంత ఇల్లులా భావించి, నన్నూ, పక్షిగాణ్ణి తమ కుటుంబ సభ్యుల్లా పరిగణించి వాగ్వివాదం మొదలుపెట్టారు. అతి తక్కువ సమయంలోనే తారాస్థాయికి చేరుకొంది. భర్త విడాకుల మంత్రం చదివాడు. పక్షిగాడు తానేదో నేరం చేసినట్లు కుంచించుకుపోతూ-

"ఏరా, బస్టాండులో నిలబడి కూడా ఒకరి కాపురంలో చిచ్చుపెట్టొచ్చంటావా?" అని చేతులు పట్టుకున్నాడు.

"పక్షీ! నువ్వాందోళన చెందకు. ఇదేదో ఇవ్వాళ ఏర్పడ్డ తగవులా లేదు. బహుశా ఇది వాళ్ళ దినచర్యలో భాగం కావచ్చు" అని వాణ్ణి ఊరడించాను.

ఈలోగా ఏం జరిగిందో ఏమో భార్యాభర్తల మొఖాల్లో నవ్వులు వికసించాయి.

"అవును రేపంటే రేపే. సరిగ్గా అయిదున్నర గంటలకు ఇదే సెంటర్లో మీకు స్కూటర్ నేర్పుతాను" ఆవిడ భరోసా యిచ్చింది.

"స్వీట్లు కొనితెస్తాను. వెళ్ళి యింటి దగ్గర వెయిట్ చెయ్యి" భార్యకు టాటా చెప్పి బస్సు కోసం భర్త మిగిలిపోయాడు.

పక్షిగాడు సంబరపడిపోయాడు.

"రేయ్. ఇడియట్. రేపు సాయంత్రం అయిదున్నర నన్నయ పుట్టిన ముహూర్తం అయివుండాలి. చూశావా. నా కవితా పఠనానికి ఎలాంటి ముహూర్తం కలిసొచ్చిందో."

వాడు చదవబోయే 'అర్థనూటపదహార్లు' గుర్తుకొచ్చి నవ్వలేకపోయాను.

* * *

రాక రాక వచ్చిన బస్సు ఎంతకీ కదలడం లేదు.

కురుచ క్రాపులూ, ఉబ్బిన ముఖాలూ, మెలితిప్పిన మీసాలూ - సామాన్య లక్షణాలుగా వున్న ఎలుగురు మనుషులు బస్సు పైనా, లోపలా అదే పనిగా లగేజీ ఎక్కిస్తున్నారు. పక్కవాళ్ళనడిగితే పోలీసులని చెప్పారు. ఒంటి మీద ఖాకీ దుస్తుల్లేవు కాబట్టి ప్రయివేటు పనుల్లో వుండివుంటారని సరిపెట్టుకున్నాం.

"ఏమిటబ్బా ఇంత లగేజీ" అంటూ పక్షిగాడు బస్సు కిటికీలోంచి తలదూర్చి పైకి చూడబోయాడు. చిన్న చిన్న పచ్చిమిరపకాయలు తలంబ్రాలులా పడ్డాయి.

"రేపు సాయంత్రం డియస్పీ దొరగారింట్లో ఫంక్షనుంది. కూరగాయలుం గట్రా ఎక్కించాం అని ఒక పోలీసు లగేజీ టికెట్ కొట్టబోయిన కండక్టర్‌కి సమాధానం ఇచ్చాడు.

"నువ్వూ, డ్రైవరూ కూడా వచ్చి భోంచేసి దొరగారికి కనిపించి వెళ్ళండి. అయిదున్నరకి రావాలి" మరో పోలీసు హుకుం జారీచేశాడు.

అయిదున్నర - అనేసరికి పక్షిగాడు చెవులు రిక్కించాడు.

"దొరగారి అమ్మాయికి పెళ్ళయి వారం అయింది కదా. అందుకని ఫంక్షన్ చేస్తున్నారు" మూడో పోలీసు మరికాస్త క్లూ ఇచ్చాడు.

"వారం క్రితం పెళ్ళయితే ఇప్పుడు ఫంక్షనేమిటి సార్" కండక్టర్ చొరవచూపాడు.

"చూడు కండక్టరూ నువ్వడిగేదేంటో నాకు తెల్సూ. అమ్మాయిగారిది రిజిస్టర్ మేరేజి అనే సంగతి నీకు తెల్సని నాకు తెల్సూ. చేసుకున్నది కూడా ముస్లిం కుర్రోణ్ణి. కాబట్టే మత కలహాలు జరక్కుండా రేపు అయిదున్నరకు గట్టి బందోబస్తుతో ఫంక్షన్ జరుగుతుంది. ఈ విషయం ఇంకోచోట చెబితే మర్యాదగా వుండదు. బస్సుకురైటు చెప్ప" నాలుగో పోలీసు బెదిరింపుతో బస్సు కదిలింది.

"రేపు సాయంత్రం అయిదున్నర - అద్భుతమైన ముహూర్తం రా"

నా చెయ్యిని బలంగా నొక్కాడు పక్షిగాడు.

* * *

మరుసటి రోజు సాయంత్రం నాలుగున్నర గంటలకే రెడీ అయి కూర్చున్నాన్నేను. గ్లూకోజ్ పాకెట్లూ, మంచినీళ్ళ సీసా, టర్కీ టవలూ సంచిలో పెట్టింది మా ఇంటావిడ. ఎందుకయినా మంచిదని - అప్పడే నా చేత రెండు బికాంప్లెక్స్ మాత్రల్ని కూడా మింగించింది.

స్కూటర్ ఆగిన చప్పడయ్యింది. ఆహా! ఇంకేముంది. పక్షీంద్రుడు వచ్చేశాడు. ఈ ఒక్క రోజూ పొదుపు చర్యల్ని ప్రక్కన పెట్టి స్కూటర్ మీద వచ్చాడు.

వాడి గెటప్పే మారిపోయింది. ఫేంటూ షర్టూ స్థానంలో లాల్చీ పైజామా లొచ్చాయి. భుజానికో సంచీ. అన్నిటికన్నా విచిత్రం వేళ్ళ మధ్య వెలుగుతున్న సిగరెట్టు!

"ఈ పాడు అలవాటు ఎప్పట్నుంచన్నయ్యా?" అంటూ నా భార్యామణి ముక్కు మూసుకొని వచ్చింది.

"అదేమిటి చెల్లాయ్. కవిత్వమొకటే అనుకున్నాను. నీకు సిగరెట్టన్నా ఎలర్జీయేనా?" పక్షిగాడు శ్రీశ్రీ పద్ధతిలో దమ్ములాగి వదిలాడు.

"ఏమండీ. మీరిక బయల్దేరండి. నేను పిల్లలకి స్నానాలు చేయించి అయిదున్నరకల్లా ఇంట్లో కూర్చోబెట్టాలి" అంటూ నన్నూ పక్షిగాణ్ణి బయటకు పంపించేసింది.

"ఏరా చెల్లాయి అయిదున్నరంటుంది. ఏదన్నా పూజా?"

పక్షిగాడి ముహూర్తానికి మరింత బలం చేకూరినట్లు భావించాడు.

"అవును అలాంటిదే" అని పూరుకున్నాను.

"వాకివ్వాళ టెన్షన్‌గా వుంది. స్కూటర్ నువ్వే డ్రైవ్ చెయ్యి"

అన్న పక్షిగాడి సూచన మేరకు నేనే సారథ్యం వహించాను.

అప్పటికి దాదాపు అయిదు గంటలు దాటి పదిహేను నిమిషాలవుతుంది.

రోడ్డు మీద పిట్ట లేదు. డ్రైవింగ్ చాలా హాయిగా వుంది.

కిలోమీటరుకో మనిషిలా వున్నారంతే.

"ఏవిట్రా రోడ్డు మీద జనం లేరు"

పక్షిగాడి మొదటి అనుమానం

"ముహూర్త బలం"

"ఏరా సెక్షన్ వన్ ఫార్టీఫోర్‌కీ కర్ఫ్యూకీ మధ్య ఇంకేదయినా సెక్షన్ వుందా?"

పక్షిగాడి రెండవ అనుమానం.

"సాధారణంగా ఈ రెండు ఆంక్షలే వుంటాయి. అంతకీ కసిగా వుంటే వీధికో కవిసమ్మేళనం విధించాలి. అంతకు మించి మధ్యేమార్గం లేదు."

"డియస్పీ ఇంట్లో ఫంక్షన్ కదా. కమ్యూనల్‌రైట్స్ జరక్కుండా కర్ఫ్యూ విధించారంటావా?" పక్షిగాడి మూడవ అనుమానం.

"అలా అయితే రోడ్ల మీద పోలీసులన్నా వుండాలి కదా"

ఇలాంటి అనేకానేక అనుమానాల మధ్య నిర్మానుష్యమైన వీధుల గుండా పిండాల సత్రం చేరుకున్నాం.

సత్రం దగ్గర వాతావరణం చూశాక అనుమానాలుపడే వంతు నాదయ్యింది.

ఎప్పుడూ దయ్యాలు కూడా దరిచేరని పిండాల సత్రం కళకళలాడిపోతోంది. పక్షిగాడికి ముచ్చెమట్లు పోశాయి. వాడు నా చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు అయిదున్నర కావడానికి ఇంకా అయిదు నిమిషాలే వుంది.

ఇద్దరం లోపలికి అడుగుపెట్టాం. కిటకిటలాడుతున్నారు జనం.

అందరూ కాషాయ వస్త్రాలు ధరించి వున్నారు.

"ఏమిటీ జనం?"

ధైర్యం కూడదీసుకుని గుమ్మం దగ్గర మామూలు వస్త్రాలతో వున్న వ్యక్తినడిగాను.

"జనం కాదు. పుష్కరాల రేవులో వుండే సాధువులు. చందాలు పోగుచేసి టీవీ కొనుక్కున్నారు.

"దానికింత హడావుడి ఎందుకు?"

"ఇవాళ ఆదివారం కదా. అయిదున్నరకి టీవీలో తెలుగు సినిమా వస్తుంది."

ఆ అపరిచితుడి మాటలకి నాకు తెలివి వచ్చింది.

పక్షిగాడికి పూర్వజన్మ జ్ఞానంలా పూర్వదిన జ్ఞానం వచ్చింది.

ఎవరూలేని వేళ -

దానవాయిపేట పార్కులో ప్రేయసికి ప్రియుడు జడ వేసే దృశ్యమూ

డీలక్స్ సెంటర్లో భార్య భర్తకు స్కూటర్ నేర్పుతున్న దృశ్యమూ

రోడ్ల మీద వుండాల్సిన ట్రాఫిక్ పోలీసులందరూ డియస్పీ బంగ్లాలో సాంబారు వడ్డిస్తున్న దృశ్యమూ

పక్షిగాడి కళ్ళ ముందు కదలాడాయి.

సరిగ్గా అయిదున్నర గంటలయ్యింది. పక్షిగాడు మూర్ఛిల్లాడు.